# నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, ఆదివారం 14 జూలై 2024 | NIZAMABAD



## సాగర తీరం.. అద్భుత దృశ్యం

శ్రీరాంసాగర్ జలాశయ తీరాన ఆకాశంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సాయంకాల సమయంలో నీలిమబ్బులు కనువిందు చేశాయి. ఆకాశంలోని నీలి మేఘాల ప్రతిబింబం అలలపై తేలియాడుతూ చూపరుల మనసు దోచుకున్నది. సుదూరంలో ఆకాశం, నీరు కలిసి పోయినట్టు కనిపిస్తున్న ఈ సుందర దృశ్యాన్ని నమస్తే తెలంగాణ క్లిక్ మనిపించింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ఆలయ దర్శనానికి బైక్ ర్యాలీగా వెళ్తున్న రైతులు



## వర్షాలు కురవాలని..

చినుకు జాడ లేక ఆకాశం వైపు ఆశగా చూస్తున్న రైతులు.. కరుణించాలని దేవుళ్లను వేడుకుంటున్నారు. ఆలయాలను నీటితో నింపడంతోపాటు ప్రత్యేక పూజలు, హోమాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని ధర్మారం గ్రామస్తులు శనివారం వినూత్న కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బైక్ ర్యాలీగా బయల్దేరి చుట్టుపక్కల ఉన్న 11 గ్రామాల్లోని హనుమాన్ ఆలయాలను దర్శించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకున్నారు. గ్రామానికి తిరిగి వచ్చి భజనలు చేశారు.

– పెద్ద కొడప్‌గల్, జూలై 13



మంజీర వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం ఇరుపక్కల కూలిన రాళ్ల తెట్టె

## కూలిన చెక్‌డ్యాం రాళ్ల తెట్టె

నాగిరెడ్డిపేట, జూలై13: మండలంలోని మాల్తుమ్మెద శివారులో మంజీర వాగుపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం రాళ్ల తెట్టె చిన్న వర్షానికే కూలిపోయింది. చెక్‌డ్యాం ఇరుపక్కల నీటి ప్రవాహాన్ని ఆపడానికి కాంట్రాక్టర్ రాళ్ల తెట్టెను నిర్మించారు. కాగా శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి రాళ్ల తెట్టె కూలి, మట్టి కిందికి జారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మట్టి తరచూ కిందికి జారుతుండడంతో తాత్కాలికంగా రాళ్ల తెట్టెను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో పనులు కాలేదన్నారు. పనులు నాణ్యతతో చేపట్టేలా నిత్యం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు

## భావి శాస్త్రవేత్తలకు ఆహ్వానం

- శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహం
- ఒక్కో పాఠశాల నుంచి ఐదు మాత్రమే స్వీకరణ
- సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తులకు గడువు
- ఎంపికైన వారికి రూ.20 వేల నుంచి రూ.30వేలు అందజేత


**విద్యార్థుల్లో** దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు కొత్త ప్రయోగాలు, ఆవిష్కరణల దిశగా వారిని ప్రోత్సహించి భావి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రాష్ట్రపతి భవన్‌లో ఆతిథ్యం, దేశ ప్రథమ పౌరుడితో అభినందనలు, కేంద్ర మంత్రులతో ప్రశంసలు, దేశ దిగ్గజ శాస్త్రవేత్తలతో సమాలోచనలు వంటి అవకాశం కలుగుతుంది.

–కామారెడ్డి, జూలై 13



### ప్రతి పాఠశాల నుంచి 5 ప్రాజెక్ట్‌లు..

ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమంపై ఎంఈవో, కాంప్లెక్స్ హెచ్‌ఎం,హెచ్‌ఎం,ఉపాధ్యాయులకు విద్యాశాఖ ఇప్పటికే అవగాహన కల్పించింది. జిల్లాలోని ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల నుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నారు. ఒక్కో పాఠశాల నుంచి 5 నామినేషన్లు మాత్రమే పంపేందుకు అవకాశం ఉంటుంది. ప్రయోగానికి సంబంధించిన చిత్రాలు, వివరాలు, వీడియోలు, పాఠశాల యూడైస్ నంబర్, ఈ మెయిల్, విద్యార్థి ఆధార్ కార్డు నంబర్, బ్యాంకు ఖాతా, గైడ్ ఉపాధ్యాయుడు, హెచ్‌ఎం మొబైల్ నంబర్లు తదితర వివరాలను సెప్టెంబర్ 15వ తేదీ లోగా వెబ్‌సైట్ (www.inspireawards-dst.gov.in) ద్వారా స్కూల్ అథారిటీ లాగిన్‌లో ఐదు ప్రాజెక్టులను నమోదు చేసుకోవాలి. ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, మోడల్ , కేజీబీవీల్లోని విద్యార్థులు 10 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి 6 నుంచి 10వ తరగతి వరకు చదివే వారు అర్హులు.




### ప్రతిభావంతులకు పారితోషికం..

విద్యార్థులు పంపిన ప్రాజెక్టులను డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీకి చెందిన కేంద్ర మంత్రిత్వ శాఖ ప్రతినిధులు పరిశీలిస్తారు. ఎంపికైన విద్యార్థులకు రూ.10వేలు అందజేస్తారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైతే రూ.25వేలు, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైతే రూ.40వేల నుంచి రూ.60వేల నగదు ప్రదానం చేస్తారు. ఉత్తమ ప్రాజెక్టుపై మేధో సంపత్తి హక్కులు సైతం కల్పిస్తారు. జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారంతోపాటు ఐఐటీ ప్రవేశాల్లో రిజర్వేషన్ వర్తింపజేస్తారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 2023-24 విద్యా సంవత్సరంలో 76 ప్రాజెక్టులు జిల్లాస్థాయికి ఎంపికవ్వగా అందులో ఎనిమిది ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. 2020-2021 విద్యా సంవత్సరంలో 14 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి, 2021-2022లో 78 ప్రాజెక్టులు జిల్లాస్థాయికి సెలెక్ట్ అయ్యాయి.

### ప్రతిభను వెలికితీయడానికి ఉపయోగం..



ఇన్‌స్పైర్ మనక్ కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు పారితోషికం వారి బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయి. సెప్టెంబర్ 15వ తేదీ లోపు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు చేసుకోవాలి. సందేహాలుంచే 9440414250ను సంప్రదించాలి.

**- సిద్దిరాంరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి, కామారెడ్డి**



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

## హామీలు అమలు చేయాలి

ఆర్మూర్, జూలై 13: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతు సంక్షేమ పథకాలను అమలు చేయాలని భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌తో కలిసి కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చా ఆర్మూర్ నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎకరానికి పంట పెట్టుబడి సాయం రూ.75 00, రైతులు పండించే 14 రకాల పంటలకు బోనస్, రైతు కూలీలకు రూ.12వేలు, కౌలుదారులకు రూ.15వేలు ఇస్తామని పేర్కొన్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. బీ జేపీ నాయకులు తిరుపతి రెడ్డి, భరత్, భూషణ్, హరీశ్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

## కరము పాలు చాలా కాస్ట్‌లీ గురూ!

**గాడిద పాలలో** చాలా పోషకాలు ఉంటాయి. వాటిని తాగడంతో చాలా వరకు అనారోగ్య సమస్యలు బాగవుతాయని ప్రజలు నమ్ముతారు. అయితే గాడిద పాలు దొరకడం చాలా అరుదు. వానకాలం, చలికాలంలో గాడిద పాలకు డిమాండ్ పెరుగుతుంది. వాతావరణ మార్పుల దృష్ట్యా పిల్లల్లో వచ్చే దగ్గు, ఆయాసం తగ్గడానిది వీటిని వినియోగిస్తుంటారు. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రంలో శనివారం కర్ణాటకకు చెందిన పలువురు గాడిదను పట్టుకొని తిరుగుతూ పాలు విక్రయించారు. ఇంటింటికీ వెళ్లి పాలను పితికి ఇచ్చారు. 10 మిల్లీలీటర్ల పాలను రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు. రోజుకో గ్రామానికి వెళ్తూ గాడిద పాలను విక్రయిస్తూ రూ.1000 నుంచి రూ.2000 వరకు సంపాదిస్తున్నట్లు వారు తెలిపారు.

– బిచ్కుంద, జూలై 13



## డీటీ వేధింపులు తాళలేక.. రికార్డ్ అసిస్టెంట్ బలవన్మరణం

రామారెడ్డి, జూలై 13: డిప్యూటీ తహసీల్దార్ వేధింపులు తాళలేక రికార్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం కన్నాపూర్‌లో శనివారం వెలుగు చూసింది. డీ ఎస్పీ నాగేశ్వర్‌రావు కథనం ప్రకారం.. కామారెడ్డి మండలం గూడెం వాస్తవ్యుడు తెడ్డు ప్రశాంత్ (28) తాడ్వాయి తహసీల్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే, డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్ అతడిని తరచూ వేధింపులకు గురి చేస్తున్నాడు. వాటిని భరించలేని ప్రశాంత్ రామారెడ్డి మండలం కన్నాపూర్ శివారులోని చెట్టుకు శనివారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. డీటీ వేధింపుల వల్లే చనిపోతున్నానని ప్రశాంత్ రాసిన సూసైడ్ నోట్ అతడి జేబులో లభించింది. దీంతో కుటుంబ సభ్యులు డీటీని పిలిపించే వరకు మృతదేహాన్ని కిందకు దింపవద్దని ఆందోళన చేసేందుకు సిద్ధమవగా, పోలీసులు సర్దిచెప్పారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే, డీటీపై కేసు పెట్టారా? ఏయే సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని స్థానిక ఎస్సై విజయ్‌ను ప్రశ్నించగా ఆ వివరాలేమీ చెప్పబోమన్నారు.

## అప్పుల బాధతో హోంగార్డు ఆత్మహత్య



సంపత్‌కుమార్ (ఫైల్)

వినాయక్‌నగర్, జూలై 13 : నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో హోంగార్డుగా విధులు నిర్వర్తిస్తున్న గుమ్మడిదారుల సంపత్‌కుమార్ (43) (హెచ్‌జీ-413) గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని ఎల్లమ్మగుట్టకు చెందిన సంపత్‌కుమార్ కంట్లో నుంచి నీరు కారుతున్నదని, చికిత్స కోసం నాందెడ్‌కు వెళ్తున్నట్లు శనివారం తెల్లవారుజామున 4 గంటలకు భార్య ఉమకు చెప్పి బయల్దేరాడు. ఉదయం 7.30 గంటల సమయంలో నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లోని 3వ నంబర్ ప్లాట్‌ఫాం పట్టాలపై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో రైల్వే ఎస్సై ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. బ్యాగ్‌లో ఐడీకార్డుల ఆధారంగా హోంగార్డు సంపత్‌కుమార్‌గా గుర్తించి, విషయాన్ని కుటుంబసభ్యులకు తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు యశ్వంత్, కూతురు యశస్వి ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### వేధింపులతోనే..?

ఆత్మహత్యకు పాల్పడిన హోంగార్డుకు అప్పులు ఉన్నట్లు కుటుంబీకుల ద్వారా తెలిసింది. ఇటీవల రూ.10 లక్షలు అప్పు ఉన్నాడని, కొంతమంది అతడి ఇంటికి వచ్చి గొడవచేసినట్లు మృతుడి భార్య పోలీసులతో తెలిపినట్లు సమాచారం. అప్పు ఇచ్చిన వారి వేధింపులతోనే హోంగార్డు ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నట్లు తెలిసింది.